# బాలల హక్కుల దినోత్సవం

నవంబర్ 20, 2019

#బాలలహక్కులదినోత్సవం

– ఈ మాట రాయడానికే చాలా ఇబ్బందిగా ఉంది.

ఎందుకంటే...

ఈ మధ్య మా సంస్థ కార్యక్రమాల్లో భాగంగా చాలా గ్రూప్స్ కి (ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ అధికారులు) కొన్ని ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ కండక్ట్ చేసే సందర్భంలో ఒక #సర్వే చేయడం జరుగుతుంది. అందులో కొన్ని ప్రశ్నలకు మేము వింటున్న సమాధానాలకు మైండ్ బ్లాక్ అవుతుంది.

ఉదాహరణకి:

టీచర్ లేదా పేరెంట్ పిల్లల్ని సరైన మార్గంలో పెట్టడానికి నిర్మొహమాటంగా కొట్టవచ్చు అనేవారు - 66%

పిల్లలు అటెన్షన్ కోసం లేదా పెద్దలు మందలించారన్న కోపంతో తప్పుడు కంప్లైంట్స్ చేస్తున్నారు. నిజానికి పిల్లల పై లైంగిక వేధింపులు చాలా తక్కువే అనేవారు - 83%

“ఆ అంకుల్ కి నమస్కారం పెట్టు”, “బాబాయ్ పిలుస్తున్నారు కదా? వెళ్ళను అనకూడదు”, “పెద్దలు ఏం చెప్పినా వెంటనే చేయాలి” మొదలైనవి సరైన పెంపకానికి గుర్తులు అనేవారు – 70%

అసలు ఈ స్థాయిలో పిల్లల మీద అభిప్రాయాలు ఏర్పరచుకున్న సమాజంలో పిల్లల హక్కుల గురించి మాట్లాడటం వల్ల ఉపయోగం ఉంటుందా?

నిజంగానే పిల్లలు అంత చెడ్డగా ఉన్నారా?

టీచర్స్ నీ, పేరెంట్స్ నీ భరించలేనంతగా రాచి రంపాన పెడుతున్నారా?

పేరు మోసిన విద్యా వేత్తలు, మానసిక శాస్త్ర వేత్తలు చెప్పేది – పిల్లలు పుట్టగానే సుగుణాలు ఉండవు, దుర్గుణాలు ఉండవు. ఇంట్లో అమ్మ, నాన్న మాటలు, వారి ప్రవర్తన, అలాగే స్కూల్ వాతావరణం, ఉపాధ్యాయుల ప్రభావం వల్లనే పిల్లల వ్యక్తిత్వ నిర్మాణం జరుగుతుంది. మరలాంటప్పుడు మనల్నే గమనిస్తూ, మన నుంచే నేర్చుకుంటూ ఎదుగుతున్న మన పిల్లలు మనకే నచ్చకుండా, మనం ద్వేషించే స్థాయికి చేరుకుంటున్నారు అంటే....తప్పు పిల్లలదా, మనదా?

# బాలల హక్కుల దినోత్సవం

ఈ మధ్య ఒక మీటింగ్ లో ఒక సైకాలజిస్ట్ మాట్లాడుతూ…"టీచర్స్ పిల్లల్ని కొడితే TV చానల్స్ వాళ్ళు పదే పదే scrolling వేస్తారు. కాని ఎందుకు కొట్టారో మాత్రం వెయ్యరు." అన్నాడు. అలా అనగానే అక్కడ ఉన్న వాళ్ళంతా చప్పట్లే చప్పట్లు. దాంతో ఆయన ఇంకాస్త పొంగిపోయి మరో మాట అన్నారు. "ఒక సారి నేను ఒక టీచర్ ని అడిగాను. ఆ పిల్లవాడిని ఎందుకు కొట్టావయ్యా అని. ఆ టీచర్ చెప్పిన కారణం విన్నాక నాకు కొట్టడం కాదు, వాడిని పొడిచేయ్యాలని అనిపించింది." అన్నాడు. అంత పెద్ద మాటకి మేము బిత్తరపోయి నోటిమాట రాకుండా ఉంటే… అక్కడ ఉన్న పెద్దలు మాత్రం ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారే తప్ప, పిల్లల గురించి అంత క్రూరంగా మాట్లాడటం సరికాదు అనే భావం ఒక్కరి మొహం లో కూడా కనపడక పోవడం, ఆయన అన్న మాటల్ని ఒక్కరు కూడా ఖండించకపోవడం మాకు చాలా ఆశ్చర్యం, బాధ కలిగించాయి.

ఇంత దారుణంగా పిల్లల్ని ద్వేషించే సమాజం ఎటువైపు వెళుతుంది?

ఒక మిత్రుడు, జిల్లా స్థాయి విద్యా శాఖాధికారి ఒకసారి ఇలా అన్నారు – "ఈ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పిల్లల సైకాలజీ గురించి బొత్తిగా అవగాహన లేదు. పెళ్ళికి ముందే ప్రతీ ఒక్కరికీ 'పిల్లల్ని ఎలా పెంచాలి' అనే శిక్షణ ఇప్పించాలి. అలాగే ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం B.Ed / D.Ed లో చదివిన పుస్తకాలు తప్ప, మారుతున్న కాలానికి అనుగుణంగా, పిల్లల మనస్తత్వం లో మార్పులు వస్తాయి, వాటి గురించి ఎప్పటికప్పుడు పుస్తకాలు చదివి, ఆలోచనా పరిధి పెంచుకోవాలి అని ఆలోచించే ఉపాధ్యాయులు 20% మాత్రమే ఉన్నారు మన సమాజంలో.

ఇటువంటి పెద్దలు ఉన్న సమాజంలో పిల్లలు ఎలా భద్రంగా ఉంటారు? లైంగిక వేధింపులు (child sexual abuse), exploitation లాంటివి జరగకుండా ఎలా ఉంటాయి? మారాల్సింది పిల్లలు కాదు – పెద్దల ఆలోచనలు".

అసలు పిల్లల విషయంలో పెద్దల్లో ఉన్న ఈ కండిషనింగ్ ఎప్పటినుంచో ఉందా? లేదా ఈ మధ్యే వచ్చిందా? బాలల స్నేహ పూరిత జిల్లా, రాష్ట్రం, దేశం మన ధ్యేయం అని చెప్పుకునే అధికారుల్లో అసలు ఈ విషయంపై సరైన అవగాహన ఉందా అనేది అనుమానమే!

I AM A CHILD RIGHTS CHAMPION అని గర్వంగా ఎంత మంది తల్లులు, తండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు అనగలరు?

దీని గురించి కాస్త చర్చ జరగాల్సిన సమయం వచ్చిందేమో అనిపిస్తుంది. కాస్త ఆలోచిద్దామా…?

- Padala Charitable Trust

pct2050@gmail.com